సాక్షి
మంచిర్యాల

మంగళవారం । 7 । జనవరి । 2025



వీడని మర్డర్ మిస్టరీలు!

జిల్లాలో మూడు కేసులు పోలీసులకు పెను సవాల్‌గా మారాయి. అనేక కేసులు ఛేదించిన పోలీసులు మూడు హత్య కేసులను ఛేదించడంలో మాత్రం విఫలమయ్యారు. 8లో▸



30 ఏళ్లకు సరిపడా అభివృద్ధి

మంచిర్యాల పట్టణాన్ని 30 ఏళ్లకు సరిపడా అభివృద్ధి చేస్తానని, ప్రజలకు ఏం చేయాలో తనకు తెలుసునని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.5 /16.6

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. తెల్లవారుజామున చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

చైనా మాంజా విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపెల్లి జిల్లాలో చైనా మాంజా ఎవరైన విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు హెచ్చరించారు. గాలి పటాలు ఎగురవేసేందుకు కొందరు చైనా మాంజా ఉపయోగిస్తున్నారని తెలిపారు. చైనా మాంజా ఉపయోగించేవారు ఎంతటి వారైన సరే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ చట్టం1986 ప్రకారం చైనా మాంజా విక్రయించిన వారికి ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు తెలిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రైతులకిచ్చిన హామీలు నిలబెట్టుకుంటున్నాం



క్షీరాభిషేకం చేస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క చిత్ర పటాలకు ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జనవరి 26వ తేదీ నుంచి రాష్ట్రంలో అమలు చేయబోతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంచి, టపాసులను కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంచుతూ పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో యాదయ్య సూచించారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూటీఎస్) 2025 క్యాలెండర్‌ను సోమవారం యాదయ్య ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయ సమస్యలను డీఈవో యాదయ్య దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ భట్టారి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చీపెల్లి బాపు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కరుణాకర్, ఉపాధ్యక్షురాలు పద్మ, మహాలక్ష్మి, మన్మోహన్, మంచిర్యాల మండల అధ్యక్షుడు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించిన 'సమగ్ర' ఉద్యోగులు

- నేటి నుంచి విధులకు హాజరు..

మంచిర్యాలఅర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని 28 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం సమ్మె విరమించారు. మంగళవారం నుంచి విధులకు హాజరుకానున్నారు. సోమవారం ఉదయం కేజీబీవీ, యూఆర్ఎస్, మోడల్‌స్కూల్ హాస్టళ్ల ఎస్‌వోల నిరవధిక సమ్మె కారణంగా తాత్కాలిక స్పెషల్ ఆఫీసర్ల బాధ్యతలను ప్రభుత్వ టీచర్లకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. తాత్కాలిక ఎస్‌వోలుగా విధుల్లో చేరారు. సమ్మె విరమణతో సమగ్రశిక్ష ఉద్యోగులు మంగళవారం నుంచి విధులకు హాజరుకానున్నట్లు సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.సుమలత, రాజన్న తెలిపారు. ఆర్థికేతర అంశాలను ప్రభుత్వం నెరవేస్తుందని, ఉద్యోగులకు పేస్కేల్ విషయమై త్వరలో కమిటీవేసి పరిష్కరించేందుకు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. సమ్మె కాలానికి జీతాలు ఇస్తామని ప్రకటించటంతో ఉద్యోగుల తరపున డిప్యూటీ సీఎం, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

9 నుంచి సదరం వైద్య శిబిరాలు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ వైద్యశాలలో ఈ నెల 09 నుంచి నిర్వహించే సదరం వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎస్.కిషన్ సూచించారు. అభ్యర్థులు నిర్ణీత తేదీల్లో మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని సదరం శిబిరానికి హాజరు కావాలన్నారు. సదరం సర్టిఫికెట్ కాలపరిమితి ముగిసినవారు సకాలంలో రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. సదరం శిబిరాల వివరాలు ఈ నెల 09, 17, 22, 30 తేదీల్లో శారీరక దివ్యాంగులు 60 మందికి, 20న మూగ, చెవుడు వైకల్యం ఉన్న 50 మందికి 24న కంటి చూపు సమస్యలు ఉన్న వారికి, 28న మానసిక దివ్యాంగులు 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు.



కరెంట్ కనెక్షన్‌ల తొలగింపుతో వీధిలో ఆందోళన చెందుతున్న బస్తీ వాసులు

కరెంట్ కట్

- బెల్లంపల్లిలో ప్రక్రియ ప్రారంభించిన సింగరేణి
- కన్నాల బస్తీ, టేకుల బస్తీల్లో తొలగింపు పనులు మరూ..
- రెండు విద్యుత్ కనెక్షన్లు ఉన్న క్వార్టర్ల కనెక్షన్ తొలగింపు

బెల్లంపల్లి: సింగరేణి యాజమాన్యం ఒక్కో బాధ్యత నుంచి వైదొలుగుతోంది. ఇప్పటికే క్వార్టర్లను వదిలించుకున్న సంస్థ.. ఇప్పుడు ఆ క్వార్టర్లకు సరఫరా చేసే విద్యుత్‌ను కట్ చేస్తోంది. ఎలక్ట్రిసిటీ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో బెల్లంపల్లి పట్టణంలోని క్వార్టర్లకు ఉన్న విద్యుత్ కనెక్షన్లు తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఉదయమే కన్నాల బస్తీ, టేకుల బస్తీకి సిబ్బందితో చేరుకున్న అధికారులు వరుసగా విద్యుత్ కనెక్షన్ల తొలగింపు చేపట్టారు. క్వార్టర్‌కు కరెంట్ సరఫరా చేసే వైరుతోపాటు స్తంభానికి అమర్చిన కరెంట్ బాక్స్‌లను సైతం తొలగించారు. దీంతో ఆయా బస్తీల్లో నివాసం ఉంటున్న రిటైర్డు కార్మికులు, నిరుపేదలు, కార్మిక కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని కొన్నేళ్లుగా సింగరేణి హెచ్చరిస్తోంది. ప్రభుత్వ విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని సూచించింది. దీంతో చాలా మంది ఇప్పటికే ప్రభుత్వ కనెక్షన్లు తీసుకున్నారు. ఇక ఇప్పటికే కొన్ని కనెక్షన్లు అడపాదడపా తొలగించింది. ఈసారి వరుసగా కనెక్షన్లన్నీ తొలగించడం మొదలు పెట్టింది.

గనులు మూత పడటంతో...

బెల్లంపల్లిలో బొగ్గు గనులు మూతపడటంతో సింగరేణి యాజమాన్యం కరెంట్ సరఫరా నుంచి వైదొలగాలని ఎప్పటి నుంచో ఎదురుచూస్తోంది. బెల్లంపల్లి కేంద్రంగా దాదాపు రెండు దశాబ్దాల క్రితం భూగర్భ గనులు మూతపడుతూ వచ్చాయి. పవర్ హౌస్‌ను ముంబైకి చెందిన ఓ ప్రైవేట్ సంస్థకు విక్రయించింది. సింగరేణి విభాగాలు ఇతర ప్రాంతాలకు తరలించారు. చివరికి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయాన్నీ ఎత్తేసింది. బెల్లంపల్లి ఏరియా పేరుతో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటిలో ఏర్పాటు చేశారు. గనుల మూత, విభాగాల తరలింపు, జీఎం కార్యాలయం ఎత్తివేతతో బెల్లంపల్లిలో దాదాపు సింగరేణి కార్యకలాపాలన్నీ నిలిచిపోయాయి. కేవలం సింగరేణి ఏరియా ఆస్పత్రి, బిల్డింగ్ డిపార్ట్‌మెంట్, ఎక్స్‌ప్లోరేషన్, ఎలక్ట్రిసిటీ, ఎస్అండ్‌పీసీ విభాగాలు నామమాత్రపు సిబ్బందితో అతికష్టంగా కొనసాగిస్తున్నారు.

లీజు భూమిని అప్పగించి..

బొగ్గు తవ్వకాల కోసం సింగరేణి యాజమాన్యం బెల్లంపల్లిలో బుధాకలాన్ గ్రామ శివారు సర్వే నంబర్ 170లో ఉన్న వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని 99 ఏళ్ల కాలపరిమితితో లీజుకు తీసుకుంది. కొన్నాళ్ల క్రితమే ఆ లీజు గడువు కూడా తీరిపోగా భవిష్యత్ అవసరాల కోసమని లీజు గడువును రెన్యూవల్ చేయిస్తూ వస్తోంది. ఓ పక్క గనులు మూత పడడం, మరోవైపు లీజు గడువు ముగియడంతో భూములు, కంపెనీ క్వార్టర్లు ప్రభుత్వానికి అప్పగించింది. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించింది. దీంతో చాలా మంది ఇంటి నంబర్లు తీసుకుని నల్లా కనెక్షన్ పొందారు. ఎన్పీడీసీఎల్, సింగరేణి కరెంటు కనెక్షన్లు తీసుకున్నారు. దీంతో కంపెనీ క్వార్టర్లకు ఉన్న సింగరేణి విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని యాజమాన్యం నిర్ణయించి ఆ మేరకు చర్యలు చేపట్టింది. అయితే బస్తీల్లో ఎన్పీడీసీఎల్ విద్యుత్‌లైన్ల విస్తరణ పూర్తిస్థాయిలో జరగలేదు. దీంతో ప్రభుత్వ కనెక్షన్ లేనివారు సింగరేణి చర్యతో ఆందోళన చెందుతున్నారు.



విద్యుత్ బాక్స్‌లను వ్యాన్‌లో తీసుకెళ్తున్న సిబ్బంది

ఒప్పందం జరిగిందా..?

బెల్లంపల్లిలో సింగరేణి విద్యుత్ కనెక్షన్ల తొలగించడానికి గుట్టుగా నిర్ణయం జరిగినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఇటీవల ఓ ముఖ్య ప్రజా ప్రతినిధితో సింగరేణి అధికారులు చర్చించినట్లు పుర ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆ మేరకు ముందస్తుగా డబుల్ విద్యుత్ కనెక్షన్లు ఉన్న క్వార్టర్లకు సింగరేణి కరెంట్ కనెక్షన్ తొలగిస్తున్నట్లు చేసి క్రమక్రమంగా పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇందుకు ముఖ్యప్రజా ప్రతినిధి సానుకూలతను వ్యక్తం చేయడంతో సింగరేణి సీఅండ్ ఎండీ నుంచి ఆదేశాలు వచ్చాయని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఎలక్ట్రిసిటీ అధికారులు దూకుడును ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఈవిషయమై సింగరేణి మందమర్రి ఏరియా డీజీఎం (ఎలక్ట్రిసిటీ విభాగం) కృష్ణారెడ్డిని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

రాష్ట్రస్థాయిలో జిల్లా ఖ్యాతి చాటాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



ఎంపికైన విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్రస్థాయి రాజ్యస్థీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన, రాష్ట్ర ఇన్‌స్పైర్ ప్రదర్శనలో జిల్లా ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయిలో మెరిసి జాతీయ స్థాయికి ఎంపికై జిల్లా పేరు నిలబెట్టాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా జెడ్చర్లలో జరుగుతున్న ప్రదర్శనలో పాల్గొనేందుకు సోమవారం జిల్లా నుంచి బయలుదేరుతున్న బస్సును అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైన జిల్లాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. చలి తీవ్రత దృష్ట్యా విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, 3 రోజు లు అక్కడే ఉండాల్సి ఉన్నందున తమ వెంట మా స్క్, శానిటైజర్ ఇతర అవసరమైన సామగ్రి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎస్.మధుబాబు, ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: మహిళలు వ్యాపారంలోనే కాకుండా అన్నిరంగాల్లో రాణించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఇందిరాశక్తి పథకంలో భాగంగా హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామపంచాయతీ పరిధిలోని రాజరాజేశ్వరి సంఘం సభ్యురాలు సుద్దాల విజయకు మంజూరైన సంచార చేపల విక్రయ వాహనాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు.

సమస్యలు ఆలకించి.. అర్జీలు స్వీకరించి..



అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణతో కలిసి సోమవారం అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలు ఆలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతీ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు.

- నెన్నెల మండలం పొట్యాల గ్రామానికి చెందిన తిరుమలేశ్, అర్క నారాయణ పొట్యాల్, కొంపల్లి గ్రామాలలో దాదాపు 300 జనాభా ఉందని, ప్రజల సౌకర్యార్థం గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు.
- భీమిని మండలం పెద్దపేట గ్రామానికి చెందిన అరికిల విజయ తాను కూలీ పని చేసుకుంటూ తడకల ఇంటిలో నివసిస్తున్నామని, తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన జాడి పెంటయ్య తన వ్యవసాయ భూమి నల్లవాగు ప్రాజెక్టులో ముంపునకు గురయిందని పరిహారం అందించాలని కోరారు.
- వేమనపల్లి మండలం దస్నాపూర్ గ్రామానికి చెందిన గురుండ్ల చంద్రుమెర గొర్లపల్లి గ్రామ శివారులోని తన భూమి ఆర్అండ్ఆర్ కొత్త కాలనీలో పోయినట్లుగా చూపుతుందని, ఎలాంటి భూ సేకరణ జరుగలేదని ఫిర్యాదు చేశారు.
- ది నేషనల్ అంబేద్కర్ సేవ సంస్థ ప్రతినిధులు మందమర్రిలో వైద్య కళాశాల, డిగ్రీ కళాశాలలు మంజూరు చేయాలని వినతిపత్రం అంజేశారు.

కొత్త మండలంగా ఏర్పాటు చేయాలి..



నెన్నెల మండం ఆవడం గ్రామ పంచాయతీని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి. ఆవడం, గంగారం, చిన్నవెంకటపూర్, కొత్తూర్, జెండావెంకటాపూర్, చిత్తపూర్, మెట్‌పెల్లి, నార్వాయిపేట, గుండ్లసోమారం గ్రామాల్లో 20 వేల జనాభా ఉంది. నెన్నెలకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. విద్య, వైద్యం, రెవెన్యూ, పోలీస్‌స్టేషన్, తదితర ప్రభుత్వ కార్యాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. 9 గ్రామాలను కలుపుతూ ఆవడం మండలంగా ఏర్పాటు చేయాలి.

– కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుర్గం రవీందర్, తారచందు, మల్లిక, రాజ్‌కుమార్, దేవేందర్, జలీల్, తిరుపతి

ప్రభుత్వ సాయం అందించాలి..



నిరుపేదలమైన మేము మేకల కాపారిగా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మూడు నెలల క్రితం అడవిలోకి వెళ్లగా ఎలుగుబంటి దాడిచేసింది. నా రెండు కళ్లు పోయాయి. అటవీ శాఖ అధికారులు రూ.20 వేలు మాత్రమే అందించి చేతులు దులుపుకున్నారు. నాకున్న 8 మేకలు అమ్ముకుని చికిత్స చేయించుకున్నాను. కళ్లు పోవడంతో నా కుటుంబం భిక్షాటన చేయాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం పింఛన్ కూడా రావడం లేదు. ప్రభుత్వ సాయం అందించండి.

– జగనాథుల నాగరాజు, మధునక్క, గుడిపేట్, హాజీపూర్

ఉమ్మడి జిల్లా ఓటర్లు @ 23,25,517

- పురుషులతో పోల్చితే మహిళలే అధికం
- నియోజకవర్గాల వారీగా టాప్‌లో మంచిర్యాల.. చివరన బెల్లంపల్లి
- తుది జాబితా ప్రకటించిన అధికారులు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటర్ల లెక్క తేలింది. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం–2025లో భాగంగా ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఓటర్ల తుది జాబితాను ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు(కలెక్టర్లు) సోమవారం ప్రకటించారు. ఈ ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 23,25,517 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 11,37,514 మంది, మహిళలు 11,87,865 మంది, ఇతరులు 138 మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోల్చితే మహిళా ఓటర్ల సంఖ్యనే ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా ఉంది. 50,351 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే మంచిర్యాల నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లుండగా బెల్లంపల్లిలో అత్యల్ప ఓటర్లు ఉన్నారు.

నిర్మల్ నియోజకవర్గంలో అతివలే అధికం..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పురుష ఓటర్లతో పోల్చితే మహిళా ఓటర్ల సంఖ్యనే అధికంగా ఉంది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల భవితవ్యాన్ని అతివలే నిర్ణయించనున్నారు. మహిళా ఓటర్లు నిర్మల్ నియోజకవర్గంలో అత్యధికంగా 14,642 మంది ఉండగా అత్యల్పంగా సిర్పూర్‌లో 488 మంది ఉన్నారు. ఇక నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. ముథోల్‌లో 7,850, చెన్నూర్‌లో 2,085, బెల్లంపల్లిలో 2,127, మంచిర్యాలలో 3,115, ఆసిఫాబాద్‌లో 1,998, ఖానాపూర్‌లో 5,392 , ఆదిలాబాద్‌లో 5,755 మంది ఉండగా బోథ్‌లో 6,899 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నట్లుగా ఎన్నికల అధికారులు ప్రకటించిన జాబితా స్పష్టం చేస్తోంది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
సిర్పూర్	320	1,15,323	1,15,811	16	2,31,150
చెన్నూర్	230	96,964	99,049	07	1,96,020
బెల్లంపల్లి	227	88,109	90,286	13	1,78,408
మంచిర్యాల	290	1,39,306	1,42,421	26	2,81,753
ఆసిఫాబాద్	358	1,13,815	1,15,813	16	2,29,644
ఖానాపూర్	308	1,11,157	1,16,549	14	2,27,720
ఆదిలాబాద్	292	1,21,050	1,26,805	06	2,47,861
బోథ్	303	1,03,554	1,10,453	02	2,14,009
నిర్మల్	306	1,23,088	1,37,730	21	2,60,839
ముథోల్	311	1,25,148	1,32,948	17	2,58,113

కొత్తగా 21వేల ఓటర్లు నమోదు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొత్తగా 21,902 మంది ఓటర్లు పెరిగారు. గతేడాది అక్టోబర్ 29న ప్రకటించిన ముసాయిదా జాబితా నుంచి సోమవారం ప్రకటించిన తుది జాబితా వరకు ఈ సంఖ్య నమోదైంది. అలాగే నాలుగు జిల్లాల పరిధిలో మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన 6,575 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 1475 మంది ఓటర్లను తొలగించగా, కొత్తగా 4,984 మంది కొత్తగా ఓటు హక్కు పొందారు. మంచిర్యాలలో 2,282 మంది ఓటర్లను తొలగించగా, 5,216 మందిని ఓటర్లుగా కొత్తగా చేర్చారు. ఆదిలాబాద్ జిల్లాలో 1898 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించగా, 5,430 మందిని కొత్తగా చేర్చారు. నిర్మల్ జిల్లాలో 920 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించగా, కొత్తగా 6,272 మంది ఓటు హక్కు పొందారు.

స్థానిక సంస్థల్లో గెలవాలి



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, వేదికపై మంత్రి సీతక్క, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ...

- విభేదాలతో పార్టీ నష్టపోయే పరిస్థితి
- ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు
- 'హస్తం' శ్రేణులకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ దిశానిర్దేశం

సాక్షి,ఆదిలాబాద్/కైలాస్‌నగర్: 'స్థానిక సంస్థల ఎన్నికల్లో వందకు వందశాతం గెలవాలి.. ఇప్పటి నుంచే సిద్ధం అవ్వండి.. పార్టీ కుటుంబం లాంటిది.. మనస్పర్థలు సహజం.. సమస్యలు ఉంటే చర్చించుకొని ముందుకెళ్లాలి.. విభేదాలతో నష్టపోయే పరిస్థితి ఉంటుంది.. పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయం అవసరం.. ఆ దిశగా పార్టీ ప్రయత్నిస్తుంది.. గాంధీభవన్ తలుపు ఎవరు తట్టినా అందుబాటులో ఉంటా.. కార్యకర్తల్లో కొంత నిరాశ వాస్తవమే.. వచ్చే నాలుగేళ్లలో అందరికీ న్యాయం చేస్తాం' అని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి సమావేశం..

కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్‌స్థాయి సమావేశం జిల్లా కేంద్రంలోని పద్మనాయక గార్డెన్‌లో సోమవారం మధ్యాహ్నం నిర్వహించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, రాష్ట్ర మంత్రి సీతక్క, ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథన్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తదితరులు హాజరయ్యారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు మొదలైన సమావేశం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది.

ఏడాది పాలన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో చేసి చూపెట్టిందని మహేశ్‌కుమార్ అన్నారు. అయితే ఆ పార్టీ సోషల్ మీడియా వేదికగా రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తుంది. దీన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది. ఏడాది పాలన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదే. 55వేల ఉద్యోగాలు ఇచ్చాం. సంక్రాంతి నుంచి రైతు భరోసా ఇవ్వబోతున్నాం. కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నాం. వీటన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేలా కార్యకర్తలు కష్టపడాలని ఆయన అన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ అభివృద్ధికి కృషి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద ప్రణాళిక ఉంది. ఆసియాలోనే అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో పత్తి పండిస్తున్నారు. ఈ క్రమంలో స్థానికంగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయబోతున్నాం. ఆదిలాబాద్ జిల్లాలో ఎయిర్ పోర్టు ఏర్పాటుతో పాటు వివిధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, రాష్ట్ర మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, నియోజకవర్గ ఇన్‌చార్జీలు శ్రీహరిరావు, కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్, శ్యామ్ నాయక్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కుమురంభీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎంపీ సోయం బాపూరావ్, మాజీ ఎమ్మెల్యేలు రేఖానాయక్, ఆత్రం సక్కు, రాథోడ్ బాపూరావ్, నారాయణరావు పటేల్, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, ఏఐసీసీ సభ్యుడు నరేష్ రాథోడ్, ఆత్రం సుగుణ, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, జీసీసీ చైర్మన్ కోట్నాక్ తిరుపతి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలి



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలి. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలి. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం కావాలి. పార్టీ ఎజెండాతోనే ముందుకెళ్లాలి.

– కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి

పార్టీ విధేయులకే సీట్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విధేయులకే సీట్లు ఇవ్వడం జరుగుతుంది. వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ముఖ్య నేతలపై ఉంది. విభేదాలు వీడి సమన్వయంతో ముందుకెళ్లాలి.

– మంత్రి సీతక్క

అభాండాలు మోపవద్దు

పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసినప్పటికీ ఓడిపోయాం. అయితే కొంత మంది వేరే పార్టీ వారితో ఒప్పందాలు చేసుకొని సొంత పార్టీ నాయకులపైనే అభాండాలు మోపుతున్నారు. మీడియాకు లీక్‌లు ఇస్తూ కథనాలు రాయిస్తున్నారు. అధిష్టానానికి తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు.

– ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

11 నుంచి టీసీసీ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో 2024–25 సంవత్సరంలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) పరీక్షలు ఈనెల 11 నుంచి 17 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపా రు. టీసీసీ పరీక్షకు అప్లికేషన్లు సమర్పించిన అ భ్యర్థులకు డ్రాయింగ్ లోయర్ గ్రేడ్, హయ్యర్‌గ్రేడ్ పరీక్షలు ఈనెల 11 నుంచి 17 వరకు, టై లరింగ్, ఎంబ్రాయిడరీ(లోయర్‌గ్రేడ్) ఈనెల 11న, టైలరింగ్, ఎంబ్రాయిడరీ(హయ్యర్‌గ్రేడ్) పరీక్షలు ఈనెల 12 నుంచి 16వరకు జరుగుతాయని వివరించారు. ఈ పరీక్షలకు హాజర య్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్‌లను వెబ్‌సై ట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతి


మహమ్మద్ ఖాసిం మృతదేహం

సోన్: మండలంలోని ఐబీ చౌరస్తా వద్ద ట్రాక్టర్ ఢీకొని పాక్‌పట్ల గ్రామానికి చెందిన మహమ్మద్ ఖాసిం (52) మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రం నుంచి మాదాపూర్ పెట్రోల్ బంక్ వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్ సంతోష్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి రోడ్డు దాటుతున్న ఖాసింను బలంగా ఢీ కొట్టాడు. దీంతో ఖాసిం ఛాతికి, తలకు తీవ్రమైన గాయాలు కాగా వెంటనే అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి అన్న గోరేమియా ఫిర్యాదు మేరకు ఎస్సై కే. గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు..


సుధాకర్ (ఫైల్)

నేరడిగొండ: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడడంతో సుధాకర్ (27) అనే యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. నాగమల్యాల్ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ గయి భీముడు కుమారుడు సుధాకర్ సోమవారం తన ట్రాక్టర్‌లో గ్రామ సమీపంలో గల వాగులో నుంచి ఇసుకను తరలించే క్రమంలో గోవింద్‌పూర్ గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో పడింది. ట్రాక్టర్ టైర్ కింద పడి సుధాకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన నికాడే శంకర్(63) అనే వృద్ధుడు సోమవారం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్ కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న శంకర్ ఇంటి ఆవరణలోని బావి నుంచి నీరు తోడే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు శంకర్ కాలుజారి బావిలో పడడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు రావుజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వీడని మర్డర్ మిస్టరీలు!



- నెల రోజుల క్రితం జిల్లా కేంద్రంలో మహిళ హత్య
- నాలుగేళ్ల క్రితం ఒకరు.. ఏడేళ్ల క్రితం మరొకరు..
- పోలీసులకు సవాల్ విసురుతున్న మర్డర్లు

జిల్లాలో జరిగిన కొన్ని హత్యలు మిస్టరీగా మిగిలిపోయాయి. ఒక హత్య ఘటనలో హంతకులు దొరకడం లేదు.. మరో ఘటనలో హంతకులు దొరికినా.. హత్యకు గురైన వ్యక్తి మృతదేహం లభించడం లేదు.. ఇంకో ఘటనలో హత్యకు గురైంది ఎవరు..? హత్య చేసింది ఎవరు..? అనేది నేటికీ తెలియడం లేదు. జిల్లాలో వెలుగులోకి వచ్చిన ఈ మూడు హత్య కేసులు పోలీసులకు పెను సవాల్‌గా మారాయి. సాంకేతికతను ఉపయోగించి అనేక కేసులు ఛేదించిన పోలీసులు జిల్లాలో జరిగిన ఈ మూడు హత్య కేసులను ఛేదించడంలో మాత్రం విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. నేరస్తులు కూడా పోలీసులకు చిక్కకుండా జాగ్రత్త పడుతూ, హత్య జరిగిన చోట సైంటిఫిక్ ఆధారాలు లభించకుండా నేరాలకు పాల్పడుతున్నారు. పోలీసుల కళ్లు గప్పి యథేచ్ఛగా బయట తిరుగుతున్నారు. – మంచిర్యాలక్రైం

హత్యకు గురైంది ఎవరో.. ? హత్య చేసింది ఎవరో.. ?

జిల్లా కేంద్రంలోని గోదావరి రైల్వే బ్రిడ్జి కింద అక్టోబర్ 14, 2018న హత్యకు గురైన ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అప్పటికే మృతదేహం గుర్తు పట్టలేనంతగా మారిపోయింది. స్థానికులు అందించిన సమచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిసర ప్రాంతాలను పరిశీలించగా అక్కడికి కొంత దూరంలో హత్య చేసి రైల్వేబ్రిడ్జి పిల్లర్ల మధ్య పడేసినట్లు పోలీసులు ఆనవాళ్లను గుర్తించారు. అనంతరం హత్య కేసుగా నమోదు చేశారు. అయితే హత్యకు గురైన వ్యక్తి ఎవరు.. ఎవరు హత్య చేసి ఉంటారు..? అనే విషయాలు తెలుసుకునేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేశారు. హత్యకు గురైన వ్యక్తి ఎవరనేది తేలితే హంతకులను సులువుగా పట్టుకోవచ్చని భావించిన పోలీసులు మృతదేహానికి సంబంధించిన ఫొటోలు రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించారు. ఎక్కడ నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో హత్యకు గురైంది ఎవరనేది నేటికీ తెలియడం లేదు.

ఎవరూ తప్పించుకోలేరు..



నేరం చేసిన వారు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరు. చట్టం అందరికీ సమానమే. హత్య, దొంగతనం, ఆత్మహత్యలకు సంబంధించిన కేసుల్లో సరైన ఆధారాలు లభించకపోవడం వల్ల కొన్ని సందర్భాల్లో కేసుల విచారణ ఆలస్యమవుతోంది. హత్య, ఆత్మహత్యల కేసుల్లో సంబంధిత కుటుంబ సభ్యులు పోలీసులకు సహకరిస్తే విచారణ త్వరగా ముగుస్తుంది. ఎలాంటి ఆధారాలు లభించకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సంబంధిత కేసును పెండింగ్‌లో పెడుతాం. – ఆర్. ప్రకాశ్, ఏసీపీ, మంచిర్యాల

నేటికీ లభించని మృతదేహం..


రవికుమార్ మృతదేహం కోసం జేసీబీతో చెరువులో తవ్వకాలు జరుపుతున్న పోలీసులు(ఫైల్)

జిల్లాలోని లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020, జూన్ 2న రవికుమార్ హత్యకు గురయ్యాడు. రవికుమార్ చెల్లెలు దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మొబైల్ డేటా ఆధారంగా హత్య కేసులో హత్యకు పాల్పడిన వారిని గుర్తించి అక్టోబర్, 2021లో అరెస్ట్ చేశారు. రవికుమార్‌ను హత్య చేయించిన తన భార్య శైలజ, సుపారి తీసుకుని హత్యకు పాల్పడిన గంగరాజం, సాయికుమార్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామంలోని చెరువు సమీపంలో రవికుమార్ తలపై బండతో మోది మృతదేహాన్ని చెరువులో పడేసినట్లు వివరించారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. హంతకులను పట్టుకున్న సమయంలో వర్షాకాలం కావడంతో చెరువులో మృతదేహాన్ని వెతకడం వీలు కావడం లేదని పోలీసులు వెల్లడించారు. ఇటీవల చెరువులో నీరు లేకపోవడంతో అనుమానిత ప్రాంతంలో జేసీబీతో పోలీసులు తవ్వకాలు జరిపారు. అయినా రవికుమార్ మృతదేహం లభించక పోవడం గమనార్హం. హత్య కేసులో కీలక ఆధారమైన మృతదేహం నాలుగేళ్లయినా లభించడం లేదు.

నెల క్రితం మహిళ హత్య..


లక్ష్మి (ఫైల్)

జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్న లక్షెట్టిపేట మండలం జెండ వెంకటపూర్ గ్రామానికి చెందిన కూ స లక్ష్మి (55)ని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి తాళం వేసి వెళ్లిపోయారు. చుట్టుపక్కల వారికి దుర్గంధం రావడంతో స్థానికులు న వంబర్ 30, 2024న పోలీసులకు సమాచా రం అందించారు. పోలీసులు ఘటన స్థలా నికి చేరుకొని తలుపు తాళం పగలగొట్టి చూడగా లక్ష్మి మృతదేహం కన్పించింది. హత్య కేసుగా నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. హత్య ఘ టన వెలుగులోకి వచ్చి నెల రోజులు గడిచి నా హంతకులు ఎవరనేది తెలియడం లేదు. హత్య ఘ టనలో ఎలాంటి ఆ . దారాలు లభించక పోవడంతో హత్య కేసును ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

గిన్నెరకు చేరిన ప్రచార రథం

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా జాతర పురస్కరించుకుని కేస్లాపూర్ నాగోబా మూరాడి నుంచి ఈ నెల 3న ప్రారంభించిన ప్రచార రథం సోమవారం మండలంలోని గిన్నెర గ్రామానికి చేరుకుంది. ఈ నెల 7న ఉట్నూర్ మండలంలోని సాలేవాడ, ఈ నెల 8న ఇంద్రవెల్లి మండలంలోని వడగామ్ గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, ఈ నెల 9న తిరిగు ప్రయాణంలో కేస్లాపూర్ గ్రామానికి చేరుకోనుంది.

ఎస్‌హెచ్‌వోపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు

బెల్లంపల్లి: బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్యపై ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణ ఫిర్యాదు చేశారు. దాడిలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆదినారాయణ సోమవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కు హెచ్‌ఆర్‌సీ నెట్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. గత నెల 29వ తేదీ రాత్రి తనపై బెల్లంపల్లిలో హత్యాయత్నం జరిగిందని, అయితే ఆ కేసును ఎస్‌హెచ్‌వో నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితులను రిమాండ్‌కు పంపించి తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

కారు ఢీకొని గాయాలు

నర్సాపూర్(జి): 61వ జాతీయ రహదారిపై మార్నింగ్ వాక్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను వెనుక నుంచి కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలైన ఘటన సోమవారం ఉదయం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఉజిగిరి గణపతి, ఆవుల్దపూర్ గంగారెడ్డిలు సోమవారం ఉదయం 5 గంటలకు జాతీయ రహదారిపై మార్నింగ్ వాక్ చేస్తూ నిర్మల్ వైపు వెళ్తున్నారు. భైంసా నుంచి నిర్మల్ వైపు వేగంగా వెళ్తున్న కారు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వీరిద్దరిని వెనుక నుంచి ఢీ కొట్టడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు నిర్మల్ ఆస్పత్రికి తరలించారు.

భూ కబ్జాకు పాల్పడిన అన్నదమ్ముళ్లకు జైలు

మంచిర్యాలక్రైం: నకిలీ భూ పత్రాలు సృష్టించి భూ కబ్జాకు పాల్పడిన ముగ్గురు అన్నదమ్ముళ్లకు రెండున్నరేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ స్థానిక ప్రత్యేక జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ (ఎక్సైజ్ కోర్టు) న్యాయమూర్తి ఉపనిషధ్వని సోమవారం తీర్పునిచ్చినట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాలకు చెందిన గాదాసు శ్రీనివాస్ 31 సంవత్సరాల క్రితం మంచిర్యాల గర్మిళ్ల శివారులోని సర్వే నంబర్ 79/1లో 12 గుంటల భూమిని సీత (సుతారి) కొమురయ్య వద్ద నుంచి కొనుగోలు చేశారు. కాగా కొమురయ్యతో కలిసి ఆయన కుమారులు శ్యాంసుందర్, రవిశంకర్‌ప్రసాద్, వెంకట రాంప్రసాద్‌లు తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కాజేయాలని ప్రయత్నించారు. ఒకరోజు శ్రీనివాస్ భూమి వద్దకు వెళ్లగా కొమురయ్య కుమారులు శ్రీనివాస్‌పై దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించారు. శ్రీనివాస్ 2014, మే 24న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై ఎస్‌కే లతీఫ్ కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.అజయ్, షహీన్ సుల్తానాలు వాదనలు వినిపించారు. నేరం రుజువైనందున శ్యాం సుందర్, రవిశంకర్ ప్రసాద్, వెంకట రాంప్రసాద్‌లకు రెండున్నరేళ్ల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కాగా కోర్టు విచారణ జరుగుతున్న సమయంలో కొమురయ్య మృతి చెందాడు. దీంతో కొమురయ్య ముగ్గురు కుమారులకు శిక్షను అమలు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎస్సై కొట్టాడని బాలుడు ఆత్మహత్యాయత్నం

భీమిని: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చితకబాదాడని ఆరోపిస్తూ ఓ మైనర్ బాలుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. డిసెంబర్ 15వ తేదీన కన్నెపల్లి మండల కేంద్రం నుంచి రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని ఆటోను, రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఓ బాలుడితో పాటు అతని బావ రమేశ్‌లపై కేసు నమోదు చేశారు. ఆటోను విడిపించుకునేందుకు బాలుడితో పాటు రమేశ్‌లు గత వారం రోజులుగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం బాలుడు పోలీస్‌స్టేషన్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. దీంతో బాధితుడిని కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఎస్సై గంగారాం తమను చితకబాదాడని, డబ్బులు సైతం డిమాండ్ చేశాడని బాలుడు, రమేశ్‌లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్సై గంగారాంను వివరణ కోరగా తాము ఎలాంటి వేధింపులకు గురి చేయలేదని, రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో సీజ్ చేసిన ఆటోను విడిపించుకునేందుకే పోలీస్‌స్టేషన్‌కు బాలుడితో పాటు రమేశ్ వచ్చారన్నారు. కోర్టు నుంచి రిలీజింగ్ ఆర్డర్ వచ్చాక ఆటోను విడుదల చేస్తామని వారితో చెప్పినట్లు తెలిపారు.

వందేభారత్‌కు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలి


కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను కలిసిన బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: సికింద్రాబాద్–నాగ్‌పూర్ మధ్య నడుస్తున్న వందే భారత్ రైలుకు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమన్నను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి కోరారు. హైదరాబాద్ చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి వచ్చిన కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రిని సోమవారం కలిశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ సౌత్ సెంట్రల్ రైల్వేలో ఆదాయపరంగా మంచిర్యాల రైల్వే స్టేషన్ నాన్ సబర్బన్ గ్రేడ్ రైల్వే స్టేషన్(ఎన్‌ఎస్‌జీ4) జాబితాలో 30వ స్థానంలో ఉందని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక్క రైల్వే స్టేషన్‌లో కూడా వందే భారత్ హాల్టింగ్ లేదని, రామగుండం, మంచిర్యాల రైల్వే స్టేషన్ల మధ్య దూరం తక్కువగా ఉందని, మంచిర్యాల స్టేషన్‌లో నిలపడం లేదని, చంద్రాపూర్, బల్లార్షల మధ్య తక్కువ దూరం ఉన్నా రెండు స్టేషన్లలో రైలుకు హాల్టింగ్ సదుపాయం ఉందని వివరించారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి నిత్యం అనేక మంది వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు హైదరాబాద్, నాగ్‌పూర్ వెళ్తుంటారని పేర్కొన్నారు. మంచిర్యాలలో రైలు నిలిపితే రైల్వే సంస్థకు అధిక ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రజలకు లాభదాయకంగా ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో మంచిర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, బెల్లంకొండ మురళీధర్, జయరామరావు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం


బ్లేడ్‌తో చేయి కోసుకున్న ఇర్ఫాన్

భీమిని: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఎదుట సోమవారం బొక్కలగుట్టకు చెందిన యువకుడు ఇర్ఫాన్ మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. ఇటీవల మండలంలోని పెద్దపేట గ్రామానికి చెందిన ఓ యువతితో ఇర్ఫాన్‌కు పెళ్లిచూపులు జరిగాయి. పెళ్లికి ఆలస్యం కావడంతో సోమవారం ఉదయం భీమినికి వచ్చి యువతికి చెందిన బంధువు పాఠశాలలో చదువుతుండగా మద్యం మత్తులో పాఠశాలకు వెళ్లాడు. ఈక్రమంలో ఉపాధ్యాయులతో గొడవ పడగా వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై విజయ్‌కుమార్ సిబ్బందితో వెళ్లగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు బ్లేడ్‌తో చేయి కోసుకున్నాడు. పోలీసులు యువకుడిని స్థానిక పీహెచ్‌సీకి, అక్కడి నుంచి బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

అటవీఅధికారులపై దాడి.. పలువురిపై కేసు

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నం గ్రామంలో ఆదివారం అటవీశాఖ అధికారులపై దాడి చేసిన ఘటనలో పలువురు మూల్తానీలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు. కేశవపట్నం గ్రామానికి చెందిన కొంత మంది కలప స్మగ్లర్ల ఆచూకీ కోసం వెళ్లిన అటవీశాఖ అధికారులపై దాడి చేసిన ఘటనలో షేక్ జైను, షేక్ అతుల్, షేక్ పిద్దుల్, షేక్ ముజ్జు, షేక్ అఫ్రోజ్, షేక్ వాసిం, షేక్ జావుల్, షేక్ కరీం, షేక్ హసన్‌తో పాటు మరి కొంతమందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

కార్మికుల పొట్ట కొట్టిన కాంగ్రెస్

- నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి కార్మికుల సదస్సుకు హాజరు


సింగరేణి టోపీ ధరించి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తదితరులు

రెబ్బెన(ఆసిఫాబాద్): చెమట చుక్కలను రక్తంగా మార్చి సంస్థకు రూ.వేలకోట్ల లాభాలను తీసుకువస్తే.. అందులో 50 శాతం కోత విధించి లాభాల బోనస్ పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నేరుగా సింగరేణి కార్మికుల పొట్ట కొట్టిందని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సింగరేణి కార్మికుల సదస్సుకు హాజరయ్యారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేసిన విధంగానే సింగరేణి కార్మికులను సైతం మోసం చేసిందన్నారు. ఆరు గ్యారంటీలు అని చెప్పి ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. గతంలో కేసీఆర్ ఇచ్చిన దాని కంటే ఒకశాతం ఎక్కువ ఇచ్చినట్లు అతి తెలివితో లాభాల వాటా ప్రకటించి మొత్తం లాభాల నుంచి 50శాతం కోత విధించారని మండిపడ్డారు. ఒక్కో కార్మికుడికి రూ.3.5 లక్షల వరకు రావాల్సి ఉంటే రూ.1.9లక్షలు కూడా రాలేదన్నారు. గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ వాళ్లు భిక్షమేస్తే తీసుకుందాం అనే రీతిలో వ్యవహరిస్తుందని ఎద్దేవా చేశారు. కార్మికుల పక్షాన మాట్లాడాలని హితవు పలికారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 32 శాతం చెప్పినవిధంగా డైరెక్ట్‌గా పంపిణీ చేసిందని పేర్కొన్నారు. కార్మికులు గట్టిగా మాట్లాడితేనే హక్కులు సాధించుకునే ఆస్కారం ఉందన్నారు. టీబీజీకేఎస్ ఒక్క అడుగు వెనక్కి వేసినట్లు కనిపిస్తున్నా అది ఆలోచన కోసమేనని స్పష్టం చేశారు. పునర్వైభవం సాధించి అన్ని ఏరియాల్లో విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. టీబీజీకేఎస్ నాయకులు, స్థానికంగా బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. భవిష్యత్తు బీఆర్‌ఎస్ పార్టీదేనని తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కేకే -ఓసీని సందర్శించిన సింగరేణి డైరెక్టర్


మ్యాపును పరిశీలిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే –ఓసీని సోమవారం సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వరరెడ్డి ఏరియా జీఎం దేవేందర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పని ప్రదేశాలను పరిశీలించారు. గనిలో ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆఫీస్‌లో గనికి సంబంధించిన మ్యాపును పరిశీలించి ఉత్పత్తి లక్ష్యసాధనకు అధికారులకు సూచనలు చేశారు. ఇంజినీర్ వెంకటరమణ, పీవో మల్లయ్య, మేనేజర్ రామరాజు, సేఫ్టీ ఆఫీసర్ కుష్వా ఉన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీ కొట్టిన ఘటన చోటుచేసుకుంది. ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన రమేశ్ కూతురు అపూర్వ మండలంలోని బంగారుగూడ మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతుంది. రోజూ మాదిరిగానే రమేశ్ సోమవారం సాయంత్రం కూతురును ద్విచక్ర వాహనంపై తీసుకువస్తున్న క్రమంలో టిప్పర్ డ్రైవర్ ఇస్తాక్ అన్సరీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. వాహనం ముందు భాగం నుజ్జునుజ్జు కాగా తండ్రి, కూతురుకు గాయాలయ్యాయి. కాగా తృటిలో వారికి పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు చికిత్స కోసం వారిని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఐ అరెస్టుతో బెల్లంపల్లిలో కలకలం


సీఐ జగదీష్

బెల్లంపల్లి: మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ సీఐ కె.జగదీష్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకోవడం బెల్లంపల్లిలో చర్చనీయాంశమైంది. 2021లో బెల్లంపల్లి రూరల్ సీఐగా వచ్చిన జగదీష్ 2022 మార్చిలో తాండూర్ సీఐగా బదిలీపై వెళ్లారు. అక్కడ 2024 ఏప్రిల్ వరకు బాధ్యతలు నిర్వర్తించారు. బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో దాదాపు రెండున్నరేళ్ల పాటు జగదీష్ విధులు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో జగదీష్ పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. తాజాగా తొర్రూర్‌లో పని చేస్తున్న జగదీష్ బియ్యం అక్రమ దందా కేసులో ముడుపులు తీసుకుని ఏసీబీ అధికారులకు చిక్కడం సంచలనమైంది. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాదారుడి నుంచి రూ.5 లక్షలు డిమాండ్ చేసి రూ.2 లక్షలు తీసుకున్నారనే ఫిర్యాదు మేరకు జగదీష్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య సోమవారం వివరాలు వెల్లడించారు.

హెచ్‌ఎంపీవీపై అలర్ట్

- మాస్కులు ధరించి.. జాగ్రత్త పాటించి..


మాస్కులు ధరించిన అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) అనే వైరస్ వ్యాప్తి చెందుతోందన్న వార్తల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తం చేసింది. ఇందులో భాగంగా సోమవారం కలెక్టరేట్ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీ పక్, అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ మాస్కులు ధరించి ప్రజావాణికి హాజరయ్యా రు. కరోనా తరహాలో మళ్లీ హెచ్‌ఎంపీవీ విస్తరించే అవకాశం ఉన్నందున ముందస్తుగా ఉన్నతాధికారులు మాస్కులు ధరించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


ఆకాశంలో అరుణ రేఖ

వేమనపల్లి: సంధ్యవేళ అస్తమిస్తున్న అరుణ బానుడు మైమరపించే అందాలతో కనువిందు చేశాడు. సోమవారం సూర్యాస్తమయం సమయంలో ఆకాశం మీదుగా రాకెట్ దూసుకెళ్లడంతో ఎరుపురంగు రేఖ ఏర్పడింది. అస్తమిస్తున్న సూర్యుడిపై గీతలాగా ఏర్పడడంతో ఆ దృశ్యం చూపరులను కనువిందు చేసింది. దీంతో పలువురు ఆసక్తిగా తిలకించారు.